నేడు జిల్లాకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాక

జగిత్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ధర్మపురి మండలం జైనా గ్రామంలో నిర్వహించనున్న గ్రామ సభలో హాజరు కావడానికి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్యాక్స్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

గొల్లపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి రైతులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు, నాయకులు ప్రభుత్వ విప్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధి భేర కిషోర్, నాయకులు దుర్గం చంద్రయ్య, కల్లెం బాలలింగయ్య, లంభ లస్మయ్య, లక్కం మల్లయ్య, కుడుకల గంగారాజం, కల్లెం రాజన్న, మద్దెల గోవర్ధన్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

మల్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో బేటీ బచావో-బేటీ పడావో పథకంపై మహిళలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, మొబైల్ వినియోగం, సోషల్‌మీడియా దుష్ప్రభావాల గురించి వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్లు 100, 112, 181, 14567, 1098 సద్వినియోగం చేసుకొని సఖీ సేవలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమి, కవిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-63 పనులకు బ్రేక్



- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- బైపాస్ రహదారులు చేస్తుండడమే కారణం
- విన్నపాలు పట్టించుకోక పోవడాన్ని తప్పుపట్టిన ధర్మాసనం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

జగిత్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్-జగిత్యాల- మంచిర్యాల జిల్లాల్లో జాతీయ రహదారి-63 విస్తరణ పనులకు బ్రేక్ పడింది. పనులను ఎక్కడికక్కడే నిలిపివేయాలంటూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ రహదారిని విస్తరించేందుకు కేంద్రం గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట పనులకు అనుమతులు మంజూరు చేసిన విషయం విదితమే. గతంలో ఉన్న రోడ్డును విస్తరించడంతో పాటు అనుకూలంగా లేనిచోట కొత్తగా నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన భూమిని సేకరించాలని నేషనల్ హైవే అథారిటీని ఆదేశించింది. ఇందులో భాగంగా మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపాలిటీలకు దూరంగా గుట్టలు, పట్టా భూముల గుండా సాగేలా అలైన్‌మెంట్ రూపొందించారు. దీని ప్రకారం నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లోని ఎన్‌హెచ్-44 నుంచి ప్రారంభమయ్యే రహదారి పలు గ్రామాల గుండా సాగుతూ జగిత్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుంది. జిల్లా సరిహద్దు ప్రాంతంలోని బండలింగాపూర్ గండి హనుమాన్ దేవస్థానం నుంచి మేడిపల్లి పడమర, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి మండలం రాయపట్నం వద్ద గోదావరి వంతెన మీదుగా మంచిర్యాల జిల్లా వైపు వెళ్తుంది.

● యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టుగా ఆర్మూర్-మంచిర్యాల రహదారి

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి జగిత్యాల జిల్లా మీదుగా మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి వరకు నిర్మించనున్న జాతీయ రహదారిని యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టుగా విస్తరించాలని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నిర్ణయించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ వరకు ఎన్‌హెచ్-63ను విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. లారీలు, భారీ ట్రక్కులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండే ఈ జాతీయ రహదారి రెండు వరుసలతో ఇరుకుగా ఉండి నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో నాలుగు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, లక్షెట్టిపేట పట్టణాలు, గ్రామాలు ఉన్న చోట బైపాస్‌లు నిర్మించి, మిగితా ప్రాంతాల్లో రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. సుమారు 131.8 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ మార్గం అత్యధికంగా జగిత్యాల జిల్లాలో 69.300 కిలోమీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 30.900 కిలో మీటర్లు, మంచిర్యాల జిల్లాలో 41.813 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు నిర్వహించడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్‌లో 14 కిలోమీటర్లు, కోరుట్ల డివిజన్‌లో 17 కిలోమీటర్లు, జగిత్యాల డివిజన్‌లో 38 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ జరపనున్నారు. ఈ మార్గంలో 6 నుంచి 12 కిలోమీటర్ల..

మిగతా 8లో..

మల్టీ లెవల్ మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పోలీస్ అదికారులతో ఎస్పీ పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. విలాసవంతమైన వస్తువులు ఇస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి పలువురు మోసాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటి నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేస్ బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ లింక్స్ ద్వారా మన దృష్టిని మరల్చే సైబర్ నేరగాళ్లు ఉన్నారన్నారు. ఎవరైనా మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీనంబర్‌కు, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో కూడిన ప్రత్యేక బృందం పని చేస్తుందని పేర్కొన్నారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

జగిత్యాల అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న ఆశావర్కర్లకు రూ.18వేల జీతం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం జగిత్యాల జిల్లాలోని ఆశా వర్కర్లు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పీఎఫ్ సౌకర్యంతో పాటు రూ.50 లక్షల బీమా ఇవ్వడంతో పాటు సాధారణ ఉద్యోగుల్లాగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు ఇందూరి సులోచన, సీఐటీయూ ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు ఆత్మకూరి లత, ప్రేమలత, జ్యోతి, జీవలత, వసంత, పద్మ, యశోద, భాగ్య, రాణి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆచార్య జయశంకర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు.

ప్రభుత్వభూమిలో పట్టాలు రద్దుచేయాలి

జగిత్యాలరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ భూమి సర్వేనంబర్లు 251, 437లోని పట్టాలను రద్దుచేసి దళితులు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు కేటాయించాలనికాంగ్రెస్ నాయకడు గంట తాతారావు నర్సింగాపూర్ పంచాయితీ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. 100 ఎకరాల ప్రభుత్వభూమిని కొంతమంది స్థానికేతరులు అక్రమంగా పట్టాలు పొందారని పేర్కొన్నారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి గ్రామంలో నిరుపేద లకు ఇవ్వాలని కాంతారావు వినతిపత్రంలో కోరారు.

ప్రజాపాలన దరఖాస్తులపై వీడియో కాన్ఫరెన్స్

జగిత్యాల, జనవరి (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తులపై మంగళవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణరావు, తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన గ్రామ సభలు, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్‌లు బిఎస్ లత, గౌతంరెడ్డిలతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

కొడిమ్యాల, జనవరి21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్న జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, అడిషనల్ ఎస్పీ భీంరావు పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను ప్రిన్సిపాల్ ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. జేఈఈ ఆన్‌లైన్ పరీక్షకు 80మంది అలాట్ అయినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. అడిషనల్ కలెక్టర్ వెంట మల్యాల సీఐ నీలం రవి, ఎంపీడీవో స్వరూప, ఎస్సై సందీప్ ఉన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

మెట్‌పల్లి రూరల్, జనవరి, 21 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ప్రతి వివరాలను తప్పకుండా రికార్డుల్లో నమోదు చేయాలని డీఆర్డీవో పీడీ రఘువరన్, అడిషనల్ పీడీ మదన్‌మోహన్‌లు కార్యదర్శులకు సూచించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 23 గ్రామాల్లో చేపట్టిన 412 పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ. 4,68,49,389 కోట్లతో 75 పనులు చేయగా కూలీలకు వేతనాలుగా రూ. 25,438, రూ. 2,69, 57,071 సామాగ్రి చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించి తప్పిదాలపై బండలింగాపూర్‌కు రూ. 17వేలు, వెల్లుల్లకు రూ. 7వేలు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవో దేవందర్‌రెడ్డి, ఈజీఎస్ అంబుడ్స్ క్రిష్ణరెడ్డి, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతిరావు ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

8



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

'పశురక్ష'.. ఏది?

- అందని బీమా పరిహారం
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని స్త్రీనిధి అధికారులు

6



అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జగిత్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పనులను అధికారులు వేగవంతం చేయాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రహదారులు, మురికి కాలువలు, నీటి పారుదల, విద్యుత్ తదితర అంశాలపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

గోదావరి లిఫ్టును పరిశీలించిన ప్రభుత్వ విప్

ధర్మపురి: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో గల గోదావరి లిఫ్ట్ ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు లిఫ్ట్‌కు సంబంధించిన విద్యుత్ ట్రిప్ కావడం వల్ల ప్రతి సారి మోటర్లు ఆగిపోవడంతో కొంత ఇబ్బంది కలుగుతుందని ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. వెంటనే ఆయన జిల్లా విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనబట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాందేని మోగిలి, కమలాకర్, రఘు, వెంకటేష్, వేణు, చంద్రమౌళి, నరేష్, తిరుపతి, శరత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన డీఈవో

మేడిపల్లి, జనవరి 21: కొండాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను జిల్లా విద్యాధికారి రాములు నాయక్ ప్రారంభించారు. విద్యార్థులు పలు రకాల వంటకాలను స్వయంగా తయారు చేసి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు హమీద్, సత్తర్ ఖలీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొడిమ్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించారు.

ప్రభుత్వం పంపిణీ చేసిన వంట పాత్రలను వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న తరగతి గదిని పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో ఇ. స్వరూప, తహసీల్దార్ రమేష్, గ్రామ కార్యదర్శి శేఖర్, ప్రధానోపాధ్యాయుడు బాబురావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ సత్యప్రసాద్ ● మున్సిపాలిటీల్లో వార్డు సభలు



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని కింగ్స్ గార్డెన్‌లో జరిగిన ప్రజాపాలన దరఖాస్తుల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తులు చేసుకోని వారు గ్రామ, వార్డు సభలలో వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సభలను ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ తిరుపతి, తహసీల్దార్ కిషన్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

జగిత్యాల అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని 29వ వార్డులో జరిగిన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేర్లు రానివారు, పిల్లల పేర్లను చేర్చుకునేవారు వార్డు సభలలో దరఖాస్తు ఇవ్వాలని కోరారు. వార్డు సభలకు రానివారు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రత్యేక డెస్కులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంగళవారం పట్టణంలోని 4, 10, 12, 19, 20, 28, 29 వార్డులలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు అనుమల్ల కృష్ణహరి, మేక పద్మావతి, పంబాల రామ్ కుమార్, పిట్ట ధర్మరాజు, క్యాదాసు నవీన్, సిరికొండ భారతి, నక్క జీవన్, బాలె లత, ముస్కు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని, జాబితాలో రాని వారు అధైర్యపడవద్దని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 15,16, 25వ వార్డులలో వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక జాబితా వెల్లడించి అభ్యంతరాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డిఐఈఓ బి.నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

- అందని బీమా పరిహారం
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని స్త్రీనిధి అధికారులు

‘పశురక్ష’.. ఏది?

మల్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు మృత్యువాత పడితే బీమా పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం పశురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో బీమా పరిహారం అందక పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలతో కొన్న పశువులు మృతి చెందడంతో పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్వశక్తి మహిళలకు డెయిరీ నిర్వహణలో భాగంగా పాడి పశువుల కొనుగోలుకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. పశువులు కొన్నప్పుడే బీమా చేయిస్తున్న అధికారులు అవి మృతి చెందితే పరిహారం అందించడం లేదు. ఇటు పరిహారం అందక, పశువులు మృతి చెందినా రుణం చెల్లించాల్సి వస్తుండడంతో వాటి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



● రూ. 92 వేల రుణం

స్త్రీనిధి ద్వారా మహిళలకు పాడి పశువుల కొనుగోలుకు 92,462 రూపాయల రుణం అందజేస్తున్నారు. ఇందులో నుంచి బీమాకు 827 రూపాయలు మినహాయించుకుంటున్నారు. ఈ రుణాన్ని మహిలలు 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్ల కాలంలో మండలంలోని తాటిపల్లి, లంబాడిపల్లి, తక్కళ్లపల్లిలో పదికిపైగా పాడి పశువులు వివిధ కారణాలతో మృతి చెందాయి. బీమా కింద ఒక్కో దానికి 75 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాల్సి ఉంది. ఆ మొత్తం ఇంత వరకు లబ్ధిదారులకు అందలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● నిర్లక్ష్యమే కారణమా..

మూగజీవాలు మృతి చెందిన నెల రోజుల్లోగా బీమా పరిహరం కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మండలంలో మాత్రం నెల దాటిన తరువాతే క్లెయిమ్ పత్రాలు పంపించడంతోనే పరిహారం అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. తమకు పరిహారం అందక పోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు

\- మిట్టపల్లి సుశీల, తాటిపల్లి

బీమా పరిహరం చెల్లించకుండా అధికారులు లేనిపోని ఇబ్బందులు పెడుతున్నారు. జీవాల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తగిన ఆధారాలు చూపినా పట్టించుకోవడం లేదు. అధికారుల చుట్టు తిరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.

స్త్రీ నిధి అధికారులకు నివేదించాం

\- జీసీ రాజయ్య, ఏపీఎం, ఐకేపీ

మృతి చెందిన పశువుల క్లెయిమ్‌లకు చెందిన పత్రాలను స్త్రీనిధి అధికారులకు పంపించాము. పశువుల మృతిపై అధికారుల అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంటుంది. క్లయిమ్ పత్రాలను పంపించడంలో జాప్యానికి మాకు సంబంధం ఉండదు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డు‘కట్ట’



నగునూర్ శివారులోని వాగు వద్ద తవ్విన కందకం

కరీంనగర్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ శివారులోని వాగులో ఇసుక అక్రమ రవాణాకు గ్రామ పంచాయతీ సిబ్బంది అడ్డుకట్ట వేశారు. మూడు రోజులుగా అర్ధరాత్రి సమయంలో కరీంనగర్ పట్టణానికి చెందిన ట్రాక్టర్లు వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాయి. అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతుండడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం వేకువజామున ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. వాగు రహదారి వెంట కందకాలు తవ్వారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసినట్లయింది.

30న కోరుట్లలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ కార్మిక సంఘు నాయకులు

కోరుట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీన కోరుట్ల పట్టణంలో నిర్వహించనున్న బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుతారి రాములు మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అమలు కొరకు బీడీ కార్మిక ప్రదర్శన క్షేత్రంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై ప్రవేశ పెట్టిన జీఎస్‌టీని రద్దు చేసి కనీస పెన్షన్ రూ.5,000 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడి కార్మిక సంఘ నాయకలు కొక్కుల శాంత, చెన్న విశ్వనాథం, మునుగురి హన్మంత్, ఎన్నం రాధ, మహేష్, ఎండి ముక్రం, ఎండి మౌలానా, ఎండి ఉస్మాన్, రామిల్ల రాంబాబు, సాయిఈశ్వరి, బాలే పద్మ, బేతి జ్యోతి, బొల్లె లక్ష్మీరాజం, కిరణ్, అందే వంశీ కృష్ణ, సమీర్ తదితరులు ఉన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మల్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన భర్త నిత్యం డబ్బుల కోసం వేధిస్తూ దాడి చేయడంతో భార్యకు తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండలంలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన పొలవేని జయకృష్ణ తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్య నివేదితను నిత్యం వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి జయకృష్ణ తన భార్యను కొట్టడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉదయం పోలీస్‌లు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మెట్‌పల్లి శివారులోని వట్టి వాగు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ లారీ డ్రైవర్ షేక్ అజాం, లారీ యాజమాని ఎండి అజార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పూడూర్ గ్రామ శివారులో జడపర్షరాములు వ్యవసాయ భూమిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కొడిమ్యాల ఎస్సై ఫోన్: 8712656831, మల్యాల సీఐ ఫోన్. 8712656818 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

స్కూటీలో మంటలు

మంథని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో ప్రమా దవశాత్తు స్కూటీలో మంటలు చెలరేగాయి. 8వ కాలనీకి చెందిన తగరం లింగయ్య, భార్య సమ్మక్కలు మంగళవారం స్కూటీపై మంథనికి వస్తుండగా కాయలు కాలిపోయి మంటలు వ్యాపించాయి. వారి వెనుక వస్తున్న ద్విచక్ర వాహన దారులు గమనించి అప్రమత్తం చేయడంతో వారు రోడ్డు పక్కకు నిలిపారు. మంటలను హెచ్‌పీ పెట్రోల్ పంప్ సిబ్బంది ఆర్పివేశారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

జగిత్యాలరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన ఈదుల రామయ్య(86) అనే వృద్ధుడు మంగళవారం ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాలనీ పరిధిలో పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను గుర్తించి అప్పగించినట్లు టూటౌన్ సీఐ ప్రసాద రావు తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా సీపీఐఆర్ పోర్టల్ ద్వారా వారి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని గుర్తించి బాధితులకు అందజేసినట్టు సీఐ తెలిపారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు సీపీఐఆర్ పోర్టర్‌లో నమోదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు. ఫోన్లు ట్రాప్ చేసి బాధితులకు అప్పగించడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుల్ సాయిని సీఐ అభినందించారు.

పోలీసుల అదుపులో గంజాయి సేవిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో గంజాయి సేవిస్తున్న విద్యార్థులను మంగళవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని కొందరు విద్యార్థులు కలిసి పల్లె ప్రకృతి వనంలో గంజాయి తాగుతుండడాన్ని గమనించిన పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దాంతో ఐదుగురు విద్యార్థులు అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయారు. మిగిలిన విద్యార్థులను అదుపులోని తీసుకుని ఠాణాకు తరలించారు. విచారణ జరుపుతున్నామని పోలీసులు వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవన్నారు.

చొప్పదండిలో పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి వద్ద విలపిస్తున్న రైతు కుటుంబం

చొప్పదండి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో మార్కెట్ రోడ్డులో ఒక ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రైతు బండారి బీరయ్య తన ఇంట్లో నిల్వ చేసిన 30క్వింటాళ్ల పత్తి దగ్ధం అయింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేయగా దాదాపు రెండు లక్షల 50వేల విలువగల పత్తి కాలిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతికావడంతో రైతు కుటుంబం కంటతడి పెట్టింది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. తమని ఆదుకోవాలని రైతు అధికారులను కోరారు.

యువకుడి మృతి ఘటనలో నిందితుల అరెస్ట్

వేములవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున ఇద్దరు యువకులపై విచక్షణారహితంగా దాడి చేసి ఒకరి మృతికి కారణమైన సంఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఈనెల 15వ తేదీ వేకువజామున వేముల వాడ పట్టణానికి చెందిన కోగిల నాగేష్, గుగులోతు రాకేష్, ఎడవల్లి హర్షిక్, వంగల మంజునాథ్‌లు మద్యం మత్తులో ఏసుకూరి రాజేందర్, దుర్గం శంకరయ్య అనే వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేశారని, దాడిలో తీవ్రంగా గాయపడిన రాజేందర్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 18న మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ సంఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. రాత్రి వేళల్లో జులాయిగా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమ్మ ఇంటికి రాలేదని

బాలుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి ఇంటికి రాలేదని కలత చెందిన ఓ ఎనిమిదేళ్ల బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాలో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పారిశుధ్య కార్మికుడు సంతోష్-పూర్ణ దంపతులకు రిత్విక్, దీక్షిత్ ఇద్దరు కొడుకులు. ఈ నెల 20న సాయంత్రం అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని సంతోష్ మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రాత్రి సంతోష్ దంపతులు ఆసుపత్రిలోనే ఉండిపోగా, మంగళవారం ఉదయమే సంతోష్ గ్రామానికి వెళ్లాడు. అనంతరం పంచాయతీ విధులు నిర్వహించేందుకు సంతోష్ వెళ్లిపోగా, ఆలస్యంగా నిద్రలేచిన పెద్ద కొడుకు రిత్విక్ తల్లిదండ్రులు రాలేదని భావించాడు. కలత చెంది చీరతో ఉరి వేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన చిన్న కొడుకు దీక్షిత్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రిత్విక్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

చొప్పదండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్ పడాల రాహుల్ హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి మాసంలో దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రమాదాలను నియంత్రించే బాధ్యత వాహనదారులపైనే ఉంటుందని అన్నారు. ఆర్‌టీఏ నియమ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవి కుమార్, ఏఎంవీఐ హరిత, రిటైర్డ్ డీడీవో జైపాల్, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ● కలెక్టరేట్ వరకు పాదయాత్ర, ధర్నా



కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించడంతో పాటు ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్‌లకు నెలకు రూ. 18వేల వేతనాన్ని నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు నాలుగు కిలోమీటర్లు పాదయాత్రగా తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేసి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితోపాటు కమిషనర్‌లకు వినతి పత్రం పంపించాలంటూ కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆశా వర్కర్‌లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతలతో వారి సమస్యలను పరిష్కరించాలని అలాగే వారికి ఫిక్స్‌డ్ వేతనాలను అందించాలని 2023 సంవత్సరంలో సెప్టెంబర్ 25 వతేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. ఈ సమ్మెలో భాగంగా హైదరాబాద్ కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్‌లు చేపట్టిన ధర్నాలో అనాటి హెల్త్ కమిషనర్ శ్రీనివాస రావు రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆశావర్కర్‌ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఫిక్స్‌డ్ వేతనాలను అసెంబ్లీ సమావేశాలల్లో తీర్మాణించి నిర్ణయించాలని కోరారు. ఆశా కార్యకర్తలు సమస్యలపై ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదావేణి మంజుల, జిల్లా గౌరవ అధ్యక్షురాలు భారతి, గాయత్రి, చంద్రకళ. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగకు మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లిలోని పెద్దమ్మగుడిలో చోరీకి పాల్పడిన కేసులో వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలోగల పెద్దమ్మగుడిలో చొరబడిన దొంగ మే 4, 2024న పుస్తెమట్టెలు ఎత్తుకెళ్లాడు. ఈ దొంగతనంపై ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామచంద్రం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శేఖర్‌రెడ్డి కేసు నమోదుచేసి దొంగతనం చేసిన శివరాత్రి సంపత్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రస్తుత ఎస్ఐ గణేశ్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ వాదించగా, కోర్టు మానిటరింగ్ అధికారి రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ఆదేపు దేవేందర్‌లు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

ముత్తారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన కూరాకుల సాయికుమార్ (22) ఆర్మీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం దక్కలేదనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయికుమార్ మూడేళ్లుగా ఆర్మీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రయత్నం చేస్తున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో ఉద్యోగాలు వచ్చినట్టే వచ్చి చేజారి పోతున్నాయని మనస్తాపం చెందేవాడు. ఈనెల 16న పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

డబ్బులు ఇప్పిస్తానని మోసం..

● వృద్ధ దంపతుల నుంచి రూ.3వేల వసూలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి ఓ వృద్ధ దంపతుల వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు రూ.3 వేలు వసూలు చేసి పారిపోయిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని అక్కపల్లికి చెందిన వృద్ధ దంపతులు అమృత-మల్లయ్యలు పనినిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న దంపతుల వద్దకు బైక్‌పై వచ్చి గుర్తు తెలియని వ్యక్తి, మహిళ ఆగారు. మీకు రూ.50 వేలు ఇప్పిస్తామంటూ నమ్మబలికారు. మల్లయ్య వద్ద ఉన్న రూ.3.వేల నగదును వసూలు చేసి వెళ్లిపోయారు. జరిగిన విషయం చుట్టుపక్కల వారితో పాటు కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు మోసగించారని పేర్కొన్నారు. దాంతో వృద్ధ దంపతులు లబోదిబోమన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని వృద్ధ దంపతులు పేర్కొన్నారు.

రూ.80వేల నగదు, బైక్ అపహరణ

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని ఓ వైన్స్ షాపు వద్ద నిలిపిన బైక్‌తో పాటు ట్యాంక్ కవర్‌లో ఉంచిన రూ.80 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధితుడు సయ్యద్ జావీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సయ్యద్ జావీద్ తన బైక్‌పై గొల్లపల్లి గ్రామ శివారులో మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లి వాహనాన్ని నిలపాడని పేర్కొన్నారు. అతడు తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు వాహనంతో పాటు ట్యాంకు కవర్లలో ఉన్న రూ.80వేల నగదును ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితుడు సయ్యద్ జావీద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

చున్నీ బైక్‌లో చిక్కుకుని

మహిళ మెడకు గాయాలు

గన్నేరువరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మెడలోని చున్నీ ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో ఇరుక్కొని మహిళ మెడకు తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి పర్శరాం తన కూతురు ప్రసన్నతో కలిసి మండలంలోని మాదాపూర్ నుంచి గన్నేరువరం ద్విచక్రవాహనంపై వస్తుండగా ఖాసింపేట మార్గమధ్యలో మెడలో ఉన్న చున్నీ వాహనం వెనక టైర్‌లో చిక్కుకొని చున్నీ మెడకు బిగుసుకుపోవడంతో ప్రసన్న కిందపడిపోయింది. దీంతో ప్రసన్న మెడకు తీవ్ర గాయం అయింది. అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ సాయిప్రేమ్ మెడ చుట్టూ చుట్టుకున్న చున్నీని తొలగించి పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో బాధితురాలిని ఎక్కించుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్ సాయి ప్రేమ్‌ను ఎస్ఐ తాండ్ర నరేష్, సీఐ కర్రె స్వామి అభినందించారు.

అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ అరెస్ట్

● రూ. 10లక్షల చిట్టి డబ్బులు ఎగవేతతో కేసు నమోదు

సైదాపూర్, జనవరి 21: అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన ఊసకోయిల వెంకటపతి అనే వ్యక్తి అక్షర చిట్‌ఫండ్‌లో రూ. 10లక్షల చిట్టి వేశాడు. చిట్టి గడువు తీరినప్పటికీ అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు చిట్టి డబ్బులు ఇవ్వడం లేదు. దాంతో వెంకటపతి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని శ్రీనివాసరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. చిట్‌ఫండ్ యజమానులు గడువు తీరిన చిట్టీల డబ్బులు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం

నిందితుడికి మూడు సంవత్సరాల జైలు

భీమారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తికి కోర్టు మంగళవారం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మండలంలోని రాగోజీపేట గ్రామానికి చెందిన రాపెల్లి నగేష్‌కు నిజామాబాద్ జిల్లా పిప్పరి మండలం భీంగల్ గ్రామానికి చెందిన ఎగోలం మనోజ్ కుమార్‌తో దుబాయ్‌లో పరిచయం ఏర్పడింది. మనోజ్ దగ్గర దుబాయ్‌కు చెందిన అలికో కంపెనీ వీసాలు ఉన్నాయని నమ్మించి రాపెల్లి నగేష్‌తో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఆరుగురి వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల చొప్పున మొత్తం రూ.2.40 లక్షలు తీసుకుని నకిలీ వీసాలు ఇచ్చాడు. తమకు ఇచ్చిన వీసాలు నకిలీవని తెలుసుకున్న నగేష్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడు మనోజ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా కేసు విచారణలో భాగంగా కోరుట్ల జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పావని నిందితుడు మనోజ్ కుమార్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తులో నిందితుడిని శిక్ష పడేలా చేసిన ఏపీపీ ప్రణయ్ కుమార్, ఎస్సైలు శ్యామ్‌రాజ్, వెంకటేశ్వర్ రావు, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మహేశ్వర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 20న బడికి వెళ్లి వస్తున్న ఎనిమిదేళ్ల బాలికను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని నిందితుడికి దేహశుద్ధి చేశారని తెలిసింది.



సంగీత కచేరి నిర్వహిస్తున్న అనుపమ



కళాకారిణి ప్రదర్శన

కొనసాగుతున్న

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాద బ్రహ్మ, లయ బ్రహ్మ సద్గురు శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కొనసా గుతున్నాయి. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్య క్రమాన్ని నాలుగో రోజు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు శ్రీత్యాగరాజ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు శిఖామణి హరికథను, ఉదయం 11.30 గంటలకు రాఘవేంద్ర తబలా సోలో కార్యక్రమాన్ని చేపట్టగా, సాయంత్రం 4.30 గంటలకు అనుపమ చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది.





తబలా వాయిస్తున్న కళాకారులు

చల్లగా చూడమ్మా.. బద్ది పోచమ్మ తల్లీ..

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీబద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు శ్రీబద్ది పోచమ్మ తల్లికి ఇష్టమైన మంగళవారం తెల్లవారు జామునుంచే దర్శనానికి తరలివచ్చారు. మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. పిల్లాపాపలు, పాడిపంటలను చల్లంగా చూడాలని అమ్మవారికి పట్నం వేసి, ఒడి బియ్యం పోసి నైవేద్యాన్ని సమర్పించారు. కల్లసాక పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు క్యూలైన్లు త్వరగా కదిలేలా చర్యలు చేపట్టారు.



రద్దీగా మారిన బద్ది పోచమ్మ ఆలయం



● అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

● అంజన్న సన్నిదిలో నిర్వహిస్తున్న నిత్యన్నదానం కోసం హైదరాబాద్ బాలనగర్‌కు చెందిన వై.దినేశ్‌రెడ్డి అనే భక్తుడు రూ.75వేలు అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్‌కు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి

- 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- ఆర్థిక సంవత్సరంలో 11 రోజుల ముందే పూర్తి



జ్యోతినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ వేగంగా 350 బిలియన్ యూనిట్ల(బియు) విద్యుత్ ఉత్పత్తి మైలు రాయిని దాటింది. ఈ మేరకు ఎన్టీపీసీ అధికార వర్గాలు మంగళ వారం ప్రకటన విడుదల చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈనెల 20వ తేదీ నాటికి గతంలో ఎన్నడూ లేని విధంగా తక్కువ రోజుల్లో 350 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జనవరి 31 నాటికి 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరుగగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11 రోజులకు ముందే కేవలం 295 రోజుల్లోనే మైలురాయిని దాటడం విశేషం. దేశవ్యాప్తంగా థర్మల్, గ్యాస్, సోలార్, విండ్, జల విద్యుత్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ఎన్టీపీసీ 76.5 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగి ఉంది. దేశానికి నాల్గవ వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ అందిస్తోంది. రాష్ట్రంలో ఎన్టీపీసీకి చెందిన రామగుండంలో 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుతోపాటు 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ), 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 10 మెగావాట్ల సర్ఫేస్ సౌర విద్యుత్ ప్రాజెక్టులు పని చేస్తున్నాయి.

తలనీలాల టెండర్‌కు

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

● వాయిదా వేసిన రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రెండు సంవత్సరాలకు తలనీలాలు సేకరించుకునేందుకు మంగళవారం నిర్వహించిన టెండర్‌కు ఆదరణ కరువైంది. మంగళవారం 2025-27 సంవత్సరానికి టెండర్‌లను ఆహ్వానించారు. గత రెండేళ్లకు గాను ఇప్పటికే టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రస్తుత పరిస్థితులలో ధర ఎక్కువైందని చెప్పి స్వామివారికి నగదును చెల్లించకుండా మొండికేశాడు. అయితే ఈ ఏడాది మార్చి మాసం నాటికి సదరు కాంట్రాక్టర్ గడువు ముగుస్తుండగా, మూడు మాసాల ముందే రాజన్న ఆలయంలో తలనీలాలను సేకరించుకునేందుకు టెండర్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం టెండర్‌ను నిర్వహిస్తున్నామని రాజన్న ఆలయ అధికారులు పత్రికా ప్రకటన చేసినప్పటికీ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఆన్‌లైన్‌లో కూడా టెండర్లు ఎవరు దాఖలు చేయకపోవడంతో రాజన్న ఆలయ అధికారులు టెండర్‌ను వాయిదా వేశారు. అయితే మరోసారి నిర్వహిస్తామని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

ఎస్సార్ఆర్ కళాశాల

డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్

గణేశ్‌నగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్, అటానమస్ కళాశాల యూజీ మూడో, ఐదో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, బీఎస్సీ హనర్స్, బీసీఏ, బీబీఏ కోర్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడో సెమిస్టర్ లో 1215 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 646 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఐదో సెమిస్టర్‌లో 1197మంది విద్యార్థులకు 768 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. [illegible]లో ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎండీలో నీరుండగానే పూడికతీత

- ఈ నెలాఖరు వరకు టెండర్లు ఖరారు
- కొత్త ప్రయోగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ) నిండా నీరు ఉండగానే కొత్త పద్ధతిలో పూడికతీత పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఎల్ఎండీ, మిడ్ మానేర్‌తోపాటు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులో ఈ కొత్తపద్ధతిలో పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని స్థాపిత లక్ష్యానికి చేర్చాలని ప్రభుత్వం భావిస్తున్నది. వర్షాలు, వరదల కారణంగా ప్రాజెక్టుల్లోకి పూడిక వచ్చి చేరుతున్నది. యేటా వచ్చే ఈ పూడికతో నీటినిల్వ సామర్థ్యం క్రమేపి తగ్గిపోతున్నది.

● పూడికతో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

ఎల్ఎండీని 24.034 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1985లో నిర్మించారు. డెడ్ స్టోరేజి లెవల్ 2.09 టీఎంసీలు కాగా, రిజర్వాయర్‌లో పూడిక పేరుక పోవడంతో కేవలం 1.9 టీఎంసీలు మాత్రమే డెడ్ స్టోరేజీలో ఉంటు న్నాయి. పూర్తి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేం దుకుగాను పూడిక తీత ఏకైక మార్గమని గుర్తించిన ప్రభుత్వం అందుకు సిద్ధమైంది. కొన్ని సంవత్సరాలుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడం, రిజర్వాయర్ల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోస్తుండడంతో ఎల్ఎండీ, మిడ్ మానేరు తదితర రిజర్వాయర్లు నిండుకుండలా ఉంటున్నాయి. నీరుండగానే పూడిక తీత చేపట్టేందుకు కొత్త పద్ధతిలో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఎల్ఎండీ, మిడ్‌మానేరు, కడెం ప్రాజెక్టుల్లో కొత్త పద్ధతిలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టును ఖరారు చేసేందుకు టెండర్లు పిలిచారు. ఈనెల 21తో గడువు ముగిసింది. 27న టెక్నికల్ బిడ్ టెండర్లు తెరవనున్నారు. అనంతరం 30న ఫైనాన్సియల్ బిడ్ తెరచి కాంట్రాక్టును ఖరారు చేస్తారు. ఈ కాంట్రాక్టు 20 ఏళ్ల పాటు కొనసాగుతూ ఆయా ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉంటుంది. మూడు ప్రాజెక్టుల్లో కలిపి 4.26 కోట్ల టన్నుల పూడిక తీయనున్నట్లు చెబుతున్నారు. పూడికలో 25శాతం ఇసుక వచ్చే అవకాశం ఉన్నది. ఈ ఇసుకను టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి కాంట్రాక్టర్ వాటిని మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. దిగువ మానేరులో 131 లక్షల టన్నులు, మధ్య మానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయాలని నిర్ణయించారు. . మూడు ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులకు 1439.55 కోట్ల రూపాయల అంచనాతో కరీంనగర్ ఇరిగేషన్ ఎస్ఈ టెండర్లు పిలిచారు. దీనికి కరీంనగర్ ఇరిగేషన్ ఇఎన్‌సీ మోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తపద్ధతిలో పూడిక తీత విజయవంతమైతే ఇతర రిజర్వాయర్లలో కూడా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది.



ఎల్ఎండీ

సిరిసిల్ల నేతన్నల సంక్షేమానికి

ప్రభుత్వం కట్టుబడి ఉంది..

- మహిళశక్తి చీరల కోసం 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్లు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నల సంక్షేమానికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇచ్చిన మాట ప్రకారం స్వశక్తి సంఘాలకు అందించే యూనిఫాం చీరల ఆర్డర్లు ఇచ్చి పెద్దఎత్తున పని కల్పించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం సిరిసిల్లలో ఒక ప్రకటన జారీ చేశారు. స్వయం సహాయక సంఘాలకు అందించే ఇందిర మహిళ శక్తి పథకంలో భాగంగా అందరికి ఒకే రంగు గల ఒక్కొక్కరికి ఒక్కో చీర అందజేసేందుకు 4.24 కోట్ల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 30వ తేదీలోపు ఈ చీరలు సిద్ధం కానున్నాయని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రభుత్వం సిరిసిల్లకు రూ.50 కోట్లతో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ యూనిఫాంల కోసం మ్యాక్స్ సొసైటీలకు 65.67 లక్షల మీటర్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చామని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్నా రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికుల సమస్యలను విస్మరించిందని, బకాయిలు కూడా చెల్లించకుండా నేత కార్మికులను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి మైథిలి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మామిడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఇటీవల జరిగిన పోటీల్లో మైథిలి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మైథిలిని ప్రిన్సిపాల్ గంగాధర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్స శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.



మైథిలి

హైవోల్టేజీ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయొద్దు

రాయికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు గ్రామం నుంచి రాయికల్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయొద్దని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామం మధ్యలో నుంచి హైవోల్టేజీ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ప్రమాదాలు ఏర్పడుతాయని రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎస్సై సుధీర్ రావు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ ఏఈ నవీన్‌తో మాట్లాడారు. 11 కేవీ విద్యుత్ వైర్లకు దూరంగానే 33 కేవీ తీగలు ఏర్పాటు చేస్తున్నామని మహిళలకు నచ్చజెప్పడంతో నిరసన విరమింపజేశారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

ఎన్‌వైకే ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగహన

గణేశ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువతకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఎక్కువ మంది యువకులు గాయాలబారిన పడుతున్నారని తెలిపారు. యువత ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని వ్యాహనాన్ని జాగ్రత్తగా నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, కారులో వెళ్తే తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ బ్లూటూత్ పెట్టుకుని పాటలు వింటూ వాహనాలను నడిపితే ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం వెంకట్ రాంబాబు, ప్రోగ్రామ్ అధికారి బసవపత్రి రవీందర్, పబ్లిక్‌రిలేషన్‌అధికారి మలహర్‌రావు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌వైకే సభ్యులు

అక్షరాలే ఉపాధి

- పుట్టుకతోనే దివ్యాంగుడు
- ఉపాధిహామీ బోర్డులు, గడపలకు డిజైన్లు వేస్తూ బతుకుదెరువు



ఉపాధిహామీ బోర్డులపై అక్షరాలు రాస్తున్న రాజయ్య

పెద్దపల్లి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బొంకూరి రాజయ్య పుట్టుకతోనే దివ్యాంగుడు. కుడి చేయి కాలు, చేయి పని చేయకపోయిన ఒంటి చేత్తో బతుకు బండి లాగిస్తున్నాడు. అక్షరాలనే నమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజయ్య డిగ్రీ వరకు చదువుకొని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. కొన్ని రోజులు ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. కుటుంబానికి సరిపడ ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో 15 ఏళ్ల క్రితం ఎడమ చేతితో గడపలపై రంగులతో ముగ్గులు వేయడం ప్రారంభించాడు. అనంతరం పలువురి సలహాతో ఈజీఎస్‌కు సంబంధించిన పనులు, నిధుల వివరాలను సూచించే బోర్డులు రాస్తూ ఉపాధి పొందుతున్నాడు. పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నేమ్ బోర్డులు రాస్తున్నాడు. భార్య కూలీ చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తోంది.

ఉపాధి కల్పించండి

- బొంకూరి రాజయ్య, గౌరెడ్డి పేట, ఆర్టిస్ట్



ఆర్థిక పరిస్థితుల వల్ల కుటుంబంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రస్తుతం ఆర్టిస్ట్‌గా జీవనాన్ని సాగిస్తూ కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. ప్రభుత్వం ద్వారా అందే పించన్ డబ్బులు, ఆర్ట్ ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్నా. ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలి.

క్రీడలతో మానసికోల్లాసం

కోరుట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కాలేజీ మైదానంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు స్మారకార్థం కోరుట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవకర్ రెడ్డి, మెట్‌పల్లి డీఎస్‌పీ అడూరి రాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

జగిత్యాల అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 12, 29, 30 వార్డులలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు కూసరి అనిల్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

పట్టణంలోని 29వ వార్డుకు చెందిన కుక్కల సునీల్ అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా ఎమ్మెల్యే అతడిని పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువకుని ఆపరేషన్‌కు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ రాము ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హర్షిత అనే విద్యార్థిని జిల్లా స్థాయి ఒలింపియాడ్ పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. హర్షితను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఎన్‌హెచ్-63 పనులకు బ్రేక్

5వ పేజీ తరువాయి

మేర భారీ బైపాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఇవేకాకుండా సుమారు ఎనిమిది ప్రాంతాల్లో చిన్న బైపాస్‌లను నిర్మించనున్నారు. రహదారి క్రాసింగ్‌ల వద్ద ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించనున్నారు. ఈ మార్గంలో దాదాపు 46 వంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్‌ఓబీలు ఉంటాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.3,850 కోట్లు కాగా వ్యయం మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల వద్ద 63వ నంబరు జాతీయ రహదారి నాగ్‌పూర్-విజయవాడ 363జాతీయరహదారితో అనుసంధానం చేయడానికి అనుగుణంగా అధికారులు ముందుకు వెళ్తున్నారు.

● హైకోర్టును ఆశ్రయించిన రైతులు

ఎన్‌హెచ్-63 కోసం అధికారులు పలు దఫాలుగా రూట్ మ్యాప్‌లో మార్పులు చేశారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం కొందరు బడా బాబులకు నష్టం వాటిల్లుతుండటంతో వారి ఒత్తిడికి తలొగ్గి రెండో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. తొలుత ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారినే నాలుగు వరసలుగా విస్తరించడానికి నిర్ణయించారు. మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపాలిటీల గుండా జాతీయ రహదారి వెళ్తుండడంతో రహదారికి ఇరువైపుల గల దుకాణాలు, ఇళ్లు, ఇతర కట్టడాలు నష్టపోయే ప్రమాదం ఉండడంతో పరిహారం భారం అవుతుందని బావించారు. దీంతో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపాలిటీల గుండా కాకుండా శివారు ప్రాంతాల్లో బైపాస్‌రహదారిని నాలుగు వరసలుగా నిర్మించాలని రూట్‌మ్యాప్ రూపొందించారు. ఈమేరకు రూపొందించిన అలైన్‌మెంట్‌తో నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. గ్రీన్ ఫీల్డ్ బైపాస్ రహదారి వల్ల రూ.కోట్లు విలువ చేసే భూములు నష్టపోవాల్సి వస్తోందని పలు గ్రామాల రైతులు ఆందోళనలు చేపట్టారు. కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను సమర్పించారు. ప్రజలు సర్వే పనులను అడ్డుకోవడం, భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పలు రకాల ఆందో ళనలు నిర్వహించారు. బైపాస్ రహదారి నిర్మాణాలకు కొత్త అలైన్‌మెంట్‌తో జీవనాధారామైన సాగు భూము లను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ కోసం అధి కారులు పనులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో వెల్లుల్ల, బండలింగాపూర్, మేడిపల్లి పడమర గ్రామాల్లో పంట పొలాలు, చేల మీదుగా రహదారి నిర్మాణం జరపడానికి అనుగుణంగా అధికా రులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులకు చెందిన భూములు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరదకాలువ నిర్మాణం, రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్ నిర్మాణం, రైల్వే లైన్ నిర్మాణంలో ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యాయి. మిగిలిన కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మళ్లీ రహదారి నిర్మాణం కోసం తమ భూములు సేకరిస్తుండటంతో వారంతా ఆందోళనబాట పట్టారు. తమకు నష్టం కలిగించే రూట్ మ్యాప్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో మేడిపల్లి (పడమర), వెల్లుల్ల, బండలింగాపూర్ తదితర గ్రామాలకు చెందిన ఎనిమిది రైతులు హైకోర్టుకు వెళ్లారు.

● పనులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ

రైతుల పక్షాన జిల్లాలోని వెల్గటూర్‌కు చెందిన న్యాయవాది దోరిశెట్టి పోచయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన ధర్మాసనం ఎన్‌హెచ్-63 పనులు ఆపాలని డబ్ల్యూపీ/1500/2025 ద్వారా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌హెచ్ అథారిటీ యాక్ట్ ప్రకారం అధికారులు విధానాలను అమలు చేయలేదని, రైతుల అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ఎన్‌హెచ్-63 పనులు ఆపాలని మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న రహదారిని అనుకొని నాలుగు వరసల రహదారిని నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం



రైతులకు ఉపాధి లేకుండా చేసే జాతీయ రహదారి విస్తరణ పనులను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం. కాళ్లరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగిన రైతులకు సరియైన న్యాయం లభించింది.

-పాడేటి రాముగౌడ్, హైకోర్టును ఆశ్రయించిన రైతు, మేడిపల్లి (పడమర)

న్యాయం గెలిచింది..



అధికారుల చర్యలు ఏడాది కాలంగా కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. భూములు ఇవ్వమని చెప్పినా పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తు న్నారు. విధిలేని పరిస్థితుల్లోనే కోర్టును ఆశ్రయించాం. కోర్టు తీర్పు ద్వారా న్యాయమే గెలిచింది.

-గిరి బాబు, బాధిత రైతు

రైతులకు అన్యాయం జరగొద్దు..



భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతుల గోడును పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఉన్న భూములన్నీ రహదారి పేరిట లాగేసుకుంటే వాళ్లు ఎలా బతకాలి. నేషనల్ హైవే అథారిటీ యాక్ట్ ప్రకారం కూడా చెల్లింపులు చేయడం లేదు. అందుకే రైతుల పక్షాన న్యాయస్థానంలో వాదనలు వినిపించా. బాధిత రైతులు ఎవరైనా 9885282923 సెల్‌నంబరులో సంప్రదిస్తే తగిన న్యాయ సహాయం అందజేస్తా.

- దోరిశెట్టి పోచయ్య, హైకోర్టు న్యాయవాది, వెల్గటూరు

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి టౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పని చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన సాధరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎజెండా అంశాలను చదివి వినిపించారు. సమావేశంలో ప్రవేశపెట్టిన 40 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పారిశుధ్య పనుల నిర్వహణ కొరకు ఫాగ్ అయిల్, క్రిమి కీటకాల నివారణ కొరకు, వాహనాల రిపేర్, స్ట్రీట్ లైట్‌లు, సీసీ కెమెరాల, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు తదితర సామాగ్రి నిర్వహణ కోరకు సభ్యులందరు ఏకగ్రీవంగా అమోదం తెలిపారు.పట్టణంలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని కౌన్సిలర్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో వార్డులో సమస్య తీవ్రంగా ఉందని సమస్యను వెంటనే పరిష్కారించాలని కౌన్సిలర్ చెట్లపల్లి మీనా కోరారు. చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మోహన్, డిఈ నాగేశ్వర్‌రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలి

మెట్‌పల్లి టౌన్, జనవరి21(ఆంధ్రజ్యోతి): పదవి ఉన్నా లేకున్నా ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెట్‌పల్లి మున్సిపల్ పాలకవర్గ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 26తో పాలక వర్గం పదవీ కాలం ముగియడంతో కమిషనర్ టి. మోహన్, అధికారులు చైర్ పర్సన్ రాణవేని సుజాతను, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్‌లను పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కారించారు. సానిటేషన్ విభాగంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న ఉద్యోగి ముజీబ్‌ను ఎమ్మెల్యే శాలువతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి

-పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ నూకపెల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్దిదారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లలో విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటుకు చొరవ చూపుతానన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి తక్షణమే కనెక్షన్‌లు ఇవ్వాలని సూచించారు. నిరుపేదల ఇళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కరెంటు సదుపాయం లేక పిల్లలు, మహిళలు, వృద్దులు ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్దిదారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న లబ్దిదారులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

కోరుట్ల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలను కలిసి వినతిపత్రం అందించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూరు గ్రామంలోని సాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని శ్రీరామ్‌సాగర్ వరద కాలువ నుండి చెరువు నింపడానికి లిఫ్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలోని రెండు బస్సు డిపోలకు అదనపు బస్సులను కేటాయించాలని కొరుతూ మంత్రులకు కలిసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఆర్‌టీసీ బస్సు నడుపడానికి చర్యలు తీసుకోవాలని మంత్రుల దృష్టికి తీసుకవెళ్లినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



మంత్రి ఉత్తమ్ కుమార్‌కు విన్నవిస్తున్న జువ్వాడి కృష్ణారావు

పసుపు పంటకు కనీస మద్దతు ధర కల్పించాలి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పసుపు పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్లమెంట్‌లో సైతం పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ బిల్లును సైతం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కవితపై సోషల్‌మీడియా వేదికగా పెట్టిన అసభ్య పోస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి వెకిలి చేష్టలు మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను ఆగం చేస్తుందని, అర్హులైన వారి పేరు లిస్టులో రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం, అధికారులు గమనించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేవంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్, కౌన్సిలర్ దేవేందర్ నాయక్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు వోల్లెం మల్లేశం, దారిశెట్టి రాజేష్, పడిగెల గంగారెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

గొల్లపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రాపల్లె గ్రామంలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు, స్థానిక పార్టీ శ్రేణులు, ఆలయ అర్చకులు లక్ష్మణ్ కుమార్‌కు పూర్ణాకుంభాభిషేకంతో ఘన స్వాగతం పలికి ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఏఎంసీ ఛైర్మన్ భీమ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, తాజామాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన అర్పపల్లి విద్యార్థి



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

సారంగాపూర్, జనవరి, 21 (ఆంధ్రజ్యోతి) ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో మండలంలోని అర్పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎండబెట్ల రక్షిత అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన మండల స్థాయి ఒలంపియాడ్ టెస్ట్‌లో సైతం ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఈ మేరకు మంగళవార ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని రక్షితను అభినందించి బహుమతిని ప్రదానం చేశారు. వీరితో పాటు ప్రధానోపాధ్యాయులు అచ్యుత్‌రెడ్డి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు రాజ నర్సయ్య, ఉపాధ్యాయులు రవి, చంద్రశేఖర్, జహీరుద్దీన్, మమత, మహేందర్, వేణుగోపాల్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

బీసీ నాయకుడికి డీసీసీ పదవి కేటాయించాలి

కోరుట్ల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కాంగ్రెస్ డిసీసీ పదవికి బీసీ నాయకుడిని ప్రకటించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకర్ల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. డిసీసీ పదవికి మాజీ ఎమ్మెల్యే కోమిరెడ్డి రాములు - జ్యోతక్క తనయులు విజయ్ ఆజాద్, కరంచంద్‌లో ఎవరికో ఒకరిని నియమించాలని రాష్ట్ర పార్టీకి వినతి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మోహన్‌రావుపేట గ్రామ మాజీ సర్పంచ్ పూదరి నర్సయ్య, నాయకులు గోనె ప్రసాద్, పల్స్ రాజేందర్, మురళి గౌడ్, మహేష్, రవి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

-కలెక్టర్ సత్యప్రసాద్ -జిల్లావ్యాప్తంగా గ్రామసభలు

మేడిపల్లి, జనవరి 21: అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభ దమ్మన్న పేటలో కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారి పేరు ఇప్పుడు ప్రకటించిన లిస్టులో రాని వారికి దరఖాస్తు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మవతి, ఏవో షాహిద్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: నాలుగు గ్యారంటీల కోసం అర్హులైన ప్రజలు గ్రామసభల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని ఎంపీడీఓ రాజేశ్వరి కోరారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం, గుట్రాజ్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ రవిబాబు పాల్గొన్నారు.

●కథలాపూర్ : మండలంలోని తుర్తి, అంబారిపేట, దూలూరు, దుంపెట గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ పర్యవేక్షణ చేశారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీఓ శంకర్ ఉన్నారు.

●కొడిమ్యాల: మండలంలోని రాంసాగర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి హాజరయ్యారు. మండలంలో మండల ప్రత్యేక అధికారి చరణ్‌దాస్, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ మేష్ పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్రాపూర్, ఫకీర్ కొండపూర్, బర్దీపూర్, కోజన్‌కోత్తూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని ఉప్పుమడుగు, చెర్లకొండాపూర్ తదితర గ్రామాల్లో వార్డు, గ్రామ సభలు మొదలయ్యాయి. జిల్లా కో ఆపరేటివ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి మనోజ్ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, తహసీల్దార్ ఖయ్యూం, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

●బీర్‌పూర్: తుంగూర్, చెర్లపెల్లి, చిత్రవేణిగూడెం గ్రామాలలో తహసీల్దార్ ముజిబుద్దిన్, ఎంపీడీవో లచ్చాలు, పంచాయతీరాజ్ ఏఈ విశ్వేందర్ రావ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు.

జాబితాలో పేరు లేదని ఆందోళన

మల్యాల: ప్రభుత్వం అమలు చేసే నూతన పథకాల అమలు కోసం మంగళవారం ఓగులాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో పలువురు మహిళలు తమ పథకాలను నిలిపివేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్దిదారుల జాబితాలో తమ పేర్లు లేకపోవడం ఎంటనీ లావణ్య అనే మహిళ అధికారులను నిలదీశారు. మళ్లీ తన దరఖాస్తును అందజేశారు. ఈ గ్రామసభలలో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్ ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.

●సారంగాపూర్: మండలంలోని బట్టపెల్లి, మేడారం తండా, లచ్చనాయక్ తండా, ఒడ్డెర కాలనీ గ్రామాల్లో గ్రామ సభలను ప్రారంబించారు.కార్యక్రమంలో తహశీల్దార్ పాల్గొన్నారు.

●పెగడపల్లి: అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని పెగడపల్లి మండల ప్రత్యేకాధికారి ఎస్.ఎల్.మనోహర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని శాలపల్లి, రాజారాంపల్లి, అయిత్‌పల్లి, ఏడుమోటలపల్లి, ఆరవెల్లి, కీచులాటపల్లి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు.

●కోరుట్ల రూరల్ : జిల్లా డిఎఫ్ఓ, మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ అద్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, ఎంపీఓ కృపాకర్, డిప్యూటీ తహసిల్దార్ ఫారూక్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని కోండ్రికర్ల, కోనరావుపేట, సత్తక్కపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డితో మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్ కలిసి పాల్గొన్నారు.

●వెల్గటూర్: ఆరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు.

●మల్లాపూర్: మండలంలో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నడికుడా, వెంకట్రావుపేట, రేగుంట, సిర్పూర్, రాఘవుపేట, వాల్గొండ గ్రామాల్లో సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు సూరమ్మ ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రులు

కథలాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22న మండలంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ సందర్శన కోసం భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్నట్టు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రులకు వివరిస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగుల కృషితో సత్ఫలితాలు

జగిత్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల నిరంతర కృషి వల్లే అభివృద్ధి, సంక్షమంలో సత్ఫలితాలు సాధ్యమవుతున్నాయని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్‌జీఓ అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్లను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి, నాయకులు మహమూద్, సాహెద్‌బాబు, రాజేందర్, రాజేశం, సుగుణాకర్, మమత, మధుకర్, శైలజ, శ్రావణి, రాజశ్రీ హరిప్రసాద్ పాల్గొన్నారు.

యువజన ఉత్సవాలు

మల్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన వార్షికోత్సవాల్లో బాగంగా తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వివేకానంద జీవిత చరిత్రపై వ్యాస రచన, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నిరుద్యోగులకు అండగా ఉంటా

రాయికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించేందుకే తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలో మంగళవారం పలువురు పట్టభద్రులను కలిసి రానున్న ఎన్నికల్లో తమకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్లు బాలె శేఖర్, కైరం సత్యం, ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, మచ్చ గంగాధర్, నిఖిల్ కుమార్, లలిత, నివేదిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కొడిమ్యాల, జనవరి21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని ప్రిన్సిపాల్ కె.వేణు అన్నారు. మంగళవారం మహిళా క్రికెట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు చొక్కాల విష్ణవి, సామల పూజ, మచ్చ నవితలకు స్టేట్ పార్టిసిపేట్ సర్టిఫికెట్లను అందించారు.

భరోసాపై ముగిసిన క్షేత్రస్థాయి సర్వే

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి కింద సాయం అందించేందుకు ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా పథకానికి అధికార యంత్రాంగం కసరత్తును ప్రారంభించింది. గత ప్రభుత్వం అందించిన రైతు బంధు పథకంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసి సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇవ్వాలని స్పష్టం చేసింది. దీంతో సంబంధిత అధికార యంత్రాంగం సర్వేను ప్రారంభించింది. జనవరి 20 వరకు సాగిన సాగుకు యోగ్యమైనభూముల ను సర్వేలో గుర్తించారు. గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి, రైతు భరోసాకు అర్హత లేని భూముల జాబితాను వెల్లడించనున్నట్లు సమాచారం.

రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌కు అనుసంధానం చేసింది ప్రభుత్వం. ఈ వివరాల ఆధారంగా ఆ భూముల్లో ఎక్కడెక్కడ ఏమున్నాయి, అందులో పంటలుసాగు అవుతున్నాయా? లేదా అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు భువన్ పోర్టల్ ద్వారా గుగూల్ చిత్రాల్లో ఏఏ సర్వే నంబర్లలలో ఉన్న వివరాలను సేకరించి వ్యవసాయ అధికారులకు అందించారు. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వేను కొనసాగించారు.



సర్వే చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

భరోసా పొందే భూములు

జగిత్యాల జిల్లాలో జనవరి 20 వరకు 299 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయింది. ఈ సర్వేలో 14657 ఎకరాల సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించగా, అందులో 5088.54 ఎకరాల భూమిని పూర్తిగా సాగుకు అవకాశం లేదని తేల్చారు అధికారులు. జిల్లాలో మొత్తం 488528 ఎకరాల్లో సర్వే చేయగా, 475565 ఎకరాల విస్తీర్ణంను సాగుకు యోగ్యమైన భూములుగా గుర్తించి తుది సర్వే నివేదికను మంగళవారం వెల్లడించారు. ఈ నివేదికను గ్రామ సభల్లో అర్హుల, అనర్హుల జాబితాను ప్రకటించి తదనంతరం ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు నిధుల విడుదల ఆధారంగా అర్హులైన సాగుకు యోగ్యమైన రైతుల భూములకు భరోసాను అందించనున్నారు.

గ్రామ సభల ద్వారా అభ్యంతరాలు స్వీకరిస్తాం

రాంచందర్, జిల్లా వ్యవసాయ అధికారి

క్షేత్రస్థాయిలో సర్వేను పారదర్శకంగా నిర్వహించాం. సర్వేలో అధికారుల దృష్టికి వచ్చిన వివరాలను గ్రామ సభల్లో వెల్లడిస్తాం. అభ్యంతరాలు స్వీకరించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలను తీసుకుంటాం, ఆ వివరాలను సైతం తెలియపరుస్తాం.